నమస్తే తెలంగాణ
# కామారెడ్డి
5 | నిజామాబాద్, మంగళవారం 2 జూలై 2024 | KAMAREDDY

## ఉత్తమ సేవలకు గుర్తింపు



రామారెడ్డి, జూలై 1: రోగులకు ఉత్తమ సేవలందిస్తున్న రామారెడ్డి పీహెచ్‌సీకి కేంద్ర ప్రభుత్వం గుర్తింపునిచ్చింది. దవాఖానలోని అన్ని విభాగాల్లో మెరుగైన సేవల నిర్వహణకు కేంద్రం నేషనల్ క్వాలిటీ అస్సూరెన్స్ స్టాండర్డ్స్ సర్టిఫికెట్‌ను సోమవారం ప్రకటించింది. జనవరిలో దవాఖానను ఢిల్లీకి ప్రత్యేక వైద్య బృందం సందర్శించింది. దవాఖానలో పాటించే శానిటేషన్, క్వాలిటీ సర్వీసులను పరిశీలించిన అనంతరం వారి నివేదిక మేరకు అవార్డును ప్రకటించారు. అవార్డు రావడంపై మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సురేశ్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. దవాఖానలో పనిచేసే సిబ్బంది శ్రమ, కృషితోనే అవార్డు సాధించగలిగామని పేర్కొన్నారు.



నిజామాబాద్ కలెక్టరేట్ వద్ద ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న డీఎస్సీ అభ్యర్థులు


## కాంగ్రెస్ ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి

- మెగా డీఎస్సీని వెంటనే ప్రకటించాలి
- లేకపోతే సర్కారు భరతం పడతాం
- డీఎస్సీ అభ్యర్థులు, ఉద్యోగార్థుల హెచ్చరిక

కంఠేశ్వర్, జూలై 1: విద్యార్థులకు, నిరుద్యోగులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని ఆశావాహులు, విద్యార్థి సంఘాల నేతలు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. నిరుద్యోగ సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని, మెగా డీఎస్సీని ప్రకటించడంతో పాటు గ్రూప్-2, 3 పోస్టులను పెంచాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చినట్లు మెగా డీఎస్సీని ప్రకటించాలని, ఈ పరీక్షను సెప్టెంబర్‌లో నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అంతకు ముందు కలెక్టరేట్ ఎదుట ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిరుద్యోగుల సమస్యలపై ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న మోతీలాల్‌కు ఏదైనా జరిగితే కాంగ్రెస్ ప్రభుత్వం అంతు చూస్తామని హెచ్చరించారు. తమ రాజకీయ స్వార్థపు క్రీడలో విద్యార్థులు బలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల సంక్షేమాన్ని పక్కనపెట్టి వారి జీవితాలతో చెలగాటమాడడం సిగ్గుచేటన్నారు. టీచర్ల బదిలీలు, ప్రమోషన్ల ద్వారా ఏర్పడిన ఖాళీలను కూడా ఈ డీఎస్సీలోనే భర్తీ చేయాలని కోరారు. టెట్ ఉత్తీర్ణత సాధించిన వారికి డీఎస్సీ పరీక్ష రాసేందుకు అవకాశం కల్పించాలని, మూడు నెలల నిర్ణీత సమయాన్ని కేటాయించాలన్నారు. డీఎస్సీ అభ్యర్థులు, విద్యార్థి నాయకులు బట్టు శ్రీధర్, శంకర్, లక్ష్మణ్, ప్రవీణ్, నర్సయ్య, స్పందన, రుక్మిణి, కృష్ణవేణి, రాధిక, చంద్రభాగ్య, స్వరూపారాణి, విమల తదితరులు నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.

**ప్రభుత్వ కార్పొరేషన్ పదవుల** నియామకం ఎటూ తేలడం లేదు. ఆశావాహులకు ఎదురుచూపులు తప్పడం లేదు. గతంలో పేర్లు ప్రకటించిన వారికి పదవులు ఉన్నాయో.. లేవో కూడా తెలియడం లేదు. సరిగ్గా పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు 37 కార్పొరేషన్లకు చైర్మన్లను నియమిస్తున్నట్లు కాంగ్రెస్ నుంచి ప్రకటనలు వెలువడ్డాయి. అయితే, అధికారికంగా జీవోలు జారీ కాలేదు. అదే సమయంలో ఎలక్షన్ కోడ్ రావడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. అయితే, కోడ్ ఎత్తేసి నెల రోజులు కావొస్తున్నా నామినేటెడ్ పోస్టుల భర్తీలో కదలిక లేదు. ఉమ్మడి జిల్లాలో నలుగురి పేర్లను వివిధ కార్పొరేషన్లకు చైర్మన్లుగా ఎంపిక చేసినట్లు ప్రకటించారు. అయితే, ఇప్పటికీ జీవో జారీ చేయడంలో తాత్సారం చేస్తుండడంపై అటు నేతల్లో, ఇటు అనుచరుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది. లోక్‌సభ పోరులో ఆశించిన స్థాయిలో ఓట్లు రాకపోవడంతో.. గతంలో ప్రకటించిన జాబితాలో మార్పులు, చేర్పులు ఉంటాయన్న ప్రచారం జరుగుతున్నది. దీంతో ఉమ్మడి జిల్లాకు చెందిన ఆ నలుగురికి పదవులు ఉంటాయా.. లేక వారి స్థానంలో కొత్త వారికి కేటాయిస్తారా? అన్నది సస్పెన్స్‌గా మారింది. ఎన్నికల కోడ్ ముగియగానే పదవీ బాధ్యతలు చేపట్టాల్సిన నేతలు ఇంటికే పరిమితం అవుతుండడంపై అనుమానాలు కలుగుతున్నాయి.

–నిజామాబాద్, జూలై 1(నమస్తే తెలంగాణ ప్రతినిధి)











# పదవులు ఉన్నట్లా.. లేనట్లా?

నామ్‌కే వాస్తేగా నామినేటెడ్ పోస్టుల భర్తీ

బాధ్యతలు చేపట్టని కాంగ్రెస్ నేతలు

- ఇంకా జారీకాని జీవో
- కాంగ్రెస్‌లో ఆశావహుల్లో అసంతృప్తి
- పదవుల కోసం హస్తం పార్టీలో పైరవీ
- ఆ నలుగురి పదవులపై తీవ్ర సందిగ్ధత

**నిజామాబాద్,** కామారెడ్డి జిల్లాల నుంచి నలుగురు కాంగ్రెస్ లీడర్లకు కార్పొరేషన్ పదవులు ఇచ్చినట్లుగా అధిష్టానం ప్రకటించింది. పదవులను దక్కించుకున్న వారంతా కోడ్ సమయంలోనే ఆయా శాఖల అధికారులతో సంప్రదింపులు జరిపారు. కార్పొరేషన్‌ల విధులు, విధివిధానాలపైనా అవగాహన పెంచుకున్నారు. తీరా చూస్తే జీవోల జారీలో జాప్యంతో గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డదన్నట్లుగా మారింది. మొత్తం 37 కార్పొరేషన్ చైర్మన్ పదవుల భర్తీలో ఉమ్మడి జిల్లాకు నాలుగు దక్కాయి. నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గానికి చెందిన ముగ్గురు నేతలకు పదవులిచ్చినట్లుగా ప్రకటనలు చేశారు. డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డికి కో-ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్‌గా, మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్‌కు తెలంగాణ మినరల్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా, కిసాన్ సెల్ అధ్యక్షుడు అన్వేశ్ రెడ్డికి తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా, కామారెడ్డి జిల్లా బాన్సువాడకు చెందిన కాసుల బాలరాజును ఆగ్రోస్ చైర్మన్‌గా నియమించనున్నట్లుగా సమాచారం అందించారు. ఇవేవీ కార్యరూపం దాల్చకపోవడంతో వారంతా నిట్టూరుస్తున్నారు. కేవలం తాహెర్‌బిన్ హుందాన్‌కు ఉర్దూ అకాడమీ చైర్మన్ పదవి ఒక్కటే అధికారికంగా భర్తీచేశారు.

### ఎవరిని వరించేనో?

పార్లమెంట్ ఎన్నికలు కాంగ్రెస్ పార్టీలో అగ్గికి ఆజ్యం పోసినట్లు అయ్యింది. ఫలితాల ప్రభావం ఆశావహులపై తీవ్రంగా చూపబోతున్నట్లుగా కాంగ్రెస్ పార్టీ వర్గాలు వెల్లడిస్తున్నాయి. ప్రతికూల ఫలితాలు వచ్చిన చోట పదవుల భర్తీలో మొండి చేయి తథ్యంగానే కనిపిస్తున్నది. ఎంపీ ఎన్నికల్లో అభ్యర్థుల విజయం కోసం, పార్టీ విస్తరణకు పనిచేయని నేతలకు చెక్ పెట్టేలా పీసీసీ అధినాయకత్వం ఆలోచన చేస్తున్నట్లుగా తెలుస్తున్నది. ఇందులో భాగంగా నిజామాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో కాంగ్రెస్ పార్టీకి అపజయం దక్కడంతో పదవుల భర్తీలో ప్రాధాన్యతలు మారే అవకాశాలు లేకపోలేదన్న వాదన వినిపిస్తున్నది. అందుకే జీవోల జారీలో తీవ్ర ఆలస్యం చోటు చేసుకుంటున్నట్లు సమాచారం. ఉమ్మడి జిల్లాలో మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలోనూ ప్రాధామ్యాలు తారుమారు అయ్యే వీలు కూడా ఉన్నట్లుగా తెలుస్తున్నది. కార్పొరేషన్ నామినేటెడ్ పదవుల భర్తీలో చోటుచేసుకుంటున్న ఆలస్యంతో పోటీ పడే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతున్నది. ముందే ప్రకటించిన పేర్లకు బదులుగా మరికొంత మందికి పదవుల భర్తీలో చోటు కల్పించేందుకు పీసీసీ నాయకత్వం ఆలోచన చేస్తున్నట్లుగా ప్రచారం జరుగుతుండడంతో చాలా మంది ఢిల్లీ స్థాయిలో పైరవీలు చేసుకుంటున్నారని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. ఈ లెక్కన జీవోలు జారీ అయ్యేదాకా ఎవరెవరికి ఏయే పదవులు వస్తాయో అన్నది స్పష్టత వచ్చే అవకాశమే లేకుండా పోయింది. పదవుల పంపకం నిమిత్తం సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ టూర్‌కు వెళ్లడంతో ఈ వ్యవహారం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

## నాణ్యమైన విద్య అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మద్నూర్, జూలై 1: విద్యార్థుల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు అన్నారు. మండలంలోని పెద్ద ఏక్లారా బాలికల పాఠశాలలో నియోజకవర్గంలోని గురుకుల, నవోదయ, జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాళ్లతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల్లో ఎంత మంది చదువుతున్నారు, సిబ్బంది పూర్తిస్థాయిలో ఉన్నారా అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు వడ్డించే భోజనం, వారికి కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ప్రతి ఒక్కరికి చదువుతో పాటు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

## కేసీఆర్‌ను ఒప్పించి లిఫ్ట్ తీసుకొచ్చా..

జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు

ధర్మోర ఎత్తిపోతల పనులకు శంకుస్థాపన చేసిన జడ్పీ చైర్మన్ విఠల్‌రావు, ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి



మాట్లాతున్న జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, వేదికపై ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి

మాక్లూర్, జూలై 1: తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌ను ఒప్పించి ఎత్తిపోతల పనులకు రూ.11.71కోట్ల నిధులు మంజూరు చేయించానని జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అన్నారు. మండలంలోని ధర్మోరా గ్రామ పంచాయతీ పరిధిలోని లక్నాపూర్ శివారులో గుత్ప ఎత్తిపోతల పంప్‌హౌస్ వద్ద నిర్మించనున్న ముల్లంగి(బీ), బొంకన్‌పల్లి గ్రామాల ఎత్తిపోతల పనులకు ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డితో కలిసి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రైతులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనులు చేసుకుందామని అన్నారు. తన పదవి కాలం ఈ నెల 4తో పూర్తవుతున్నందున మిగతా పనులు పూర్తయ్యేలా చూడాలని ఎమ్మెల్యేను కోరారు. రూ.3.60లక్షల నిధులతో ఏడు గ్రామాలకు బీటీ రోడ్లు, రూ.11.71కోట్లతో ఎత్తిపోతల పనులకు శ్రీకారం చుట్టినట్లు వెల్లడించారు. తనను రాముడిగా పోల్చిన ఎమ్మెల్యే.. లక్ష్మణుడిలా పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. సాగునీటి కోసం అవస్థలుపడ్డ రెండు గ్రామాల రైతుల చిరకాల వాంఛ మరో మూడు నెలల్లో తీరనుండడంపై హర్షంవ్యక్తంచేశారు.

**కొడంగల్‌కు ఒక నీతి.. ఆర్మూర్‌కు ఒక నీతా.. ?**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీరుపై ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి అసహనం వ్యక్తంచేశారు. సీఎం సొంత జిల్లాలోని కొడంగల్‌కు రూ.1425కోట్ల నిధులు తీసుకెళ్లి మిగతా జిల్లాలకు మొండిచెయ్యి చూపుతున్నారని అన్నారు. పైలట్ ప్రాజెక్ట్ కింద ఆర్మూర్‌కు ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూల్‌ను మంజూరు చేయాలని కోరగా ఇచ్చినట్లే.. ఇచ్చి దక్షిణ తెలంగాణకు తరలించారని అన్నారు. ఐదు వేల మంది అమ్మాయిల కోసం ఎనిమిది అంతస్తుల పాఠశాలకు రూ.100కోట్లు మంజూరు చేయకపోతే ప్రజా ఉద్యమం తప్పదన్నారు. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ సూచనలతో ఆమరణ నిరాహార దీక్ష ఆపానని అన్నారు. పార్టీలన్నీ ప్రజల పక్షాన నిలబడి అభివృద్ధి పనులు చేసుకుందామని కోరారు. రూ.11.71కోట్లు మంజూరు చేయించిన జడ్పీ చైర్మన్ విఠల్‌రావును అభినందిస్తూ తనను లక్ష్మణుడిలా సంబోధించినందుకు బ్యాలెన్సింగ్ నిధులు మంజూరు చేయించి పనులు పూర్తిచేయిస్తానని వాగ్దానం చేశారు. మాక్లూర్ పీఏసీఎస్‌లో జరిగిన అవినీతిపై ఆరాతీస్తున్నామన్నారు. ఇరిగేషన్ ఎస్ఈ యశస్విని, ఈఈ భానుప్రకాశ్, కేసీఆర్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు రమణారావు, పీఏసీఎస్ చైర్మన్ బురోల్ల అశోక్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



కందకుర్తి– నవీపేట ప్రధాన రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న లబ్ధిదారులు

## రోడ్డెక్కిన డబుల్ బెడ్రూం లబ్ధిదారులు

రెంజల్, జూలై 1: కందకుర్తి గ్రామ సమీపంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్లను అందించాలని సోమవారం కందకుర్తి – నవీపేట ప్రధాన రోడ్డుపై లబ్ధిదారులు రాస్తారోకో నిర్వహించారు. కేసీఆర్ ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారుల కోసం నిర్మించిన డబుల్‌బెడ్రూం ఇండ్లను పంపిణీ చేయకపోవడంలో ఆంతర్యమేమిటో చెప్పాలని మండిపడ్డారు. డబుల్ బెడ్రూం ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో చేతులు మారినట్లు అధికారుల ముందు మొర పెట్టుకున్నారు. స్పందించిన తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలోనే అర్హులైన లబ్ధిదారుల ఆధారంగా డబుల్ బెడ్రూం ఇండ్ల పంపిణీ జరుగుతుందని, అప్పటి వరకు సంయమనం పాటించాలని సూచించారు. అక్రమంగా ఇండ్లలోకి ప్రవేశిస్తే కేసులు నమోదు చేయడమే కాకుండా డబుల్ బెడ్రూం ఇండ్లకు అర్హత కోల్పోతారని తహసీల్దార్ హెచ్చరించారు. సుమారు గంటపాటు రాస్తారోకో చేపట్టడంతో కందకుర్తి – నవీపేట, ధర్మాబాద్ – ప్రధాన రోడ్డుపై వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

### ఎస్జీటీల బదిలీలు పూర్తి

**నిజామాబాద్‌లో 1320 మందికి స్థానచలనం**

ఖలీల్‌వాడి, జూలై 1: నిజామాబాద్ జిల్లాలో ఎస్జీటీల బదిలీలు పూర్తయ్యాయని డీఈవో దుర్గాప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 1320 మందికి స్థానచలనం కల్పించినట్లు పేర్కొన్నారు. ఎస్జీటీల బదిలీలకు సంబంధించిన వెబ్‌ఆప్షన్ తుది రూపకల్పన పూర్తి చేశామని, వెంటనే ఉపాధ్యాయులు రిలీవ్ కావాలని సూచించారు.

# గోదావరికి జలకళ

తెరుచుకున్న బాబ్లీగేట్లు

**కొత్త నీటితో** త్రివేణి సంగమం వద్ద గోదావరి జలకళను సంతరించుకున్నది. ఎగువన బాబ్లీ ప్రాజెక్టు గేట్లు తెరుచుకోవడంతో సోమవారం మధ్యాహ్నం రెంజల్ మండలం కందకుర్తి వద్ద గోదావరి ప్రవహించింది. సుప్రీంకోర్టు తీర్పు మేరకు జూలై 1 నుంచి అక్టోబర్ 28వరకు బాబ్లీ గేట్లు తెరుచుకొని ఉంటాయి. రెండు రాష్ట్రాల అధికారులు ప్రాజెక్టు గేట్లను ఎత్తివేయడంతో దిగువన కందకుర్తి సమీపంలో త్రివేణి సంగమ క్షేత్రం వద్ద నిండుగా ప్రవహిస్తూ కనిపించింది. నదిలోని పురాతన శివాలయం చుట్టూ నీరు చేరడంతో భక్తులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

–రెంజల్, జూలై 1



అంతర్రాష్ట్ర సరిహద్దు వంతెన వద్ద ప్రవహిస్తున్న నీరు

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కామారెడ్డి,జూలై 1: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో విద్యాధికారులతో సీజనల్ వ్యాధులపై సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వానకాలంలో మలేరియా, ఫైలేరియా, మెదడు వాపు, డెంగీ, చికున్‌గున్యా, టైఫాయిడ్, డయేరియా, అతిసార వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని అన్నారు. పరసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో వ్యాధులను అరికట్టవచ్చని తెలిపారు. వర్షపు నీటిని నిల్వ ఉంచకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు.నీరు ఎక్కువగా నిల్వ ఉన్న ప్రాంతాల్లో మలేరియా వ్యాధిని వ్యాప్తి చెందించే దోమలు పెరుగుతాయని, నీరు నిల్వ ఉండకుండా చూడాలని అన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డేను పాటించి శుభ్రం చేయడంతో వ్యాధులను అరికట్టవచ్చని తెలిపారు. శుభ్రమైన ఆహారాన్ని తినాలని, ఆకు కూరలు, కూరగాయలు వండే ముందు శుభ్రంగా కడగాలని, ఉడికించిన ఆహారాన్ని తినాలని అన్నారు. ప్రతి ఆదివారం పది నిమిషాల సమయాన్ని కేటాయించి ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డీఆర్డీవో చందర్, డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, వైద్యాధికారులు పాల్గొన్నారు.